క్లుప్తంగా

జూన్ ఒకటి నుంచి గ్రామదేవత ఉత్సవాలు

కంచిలి: కంచిలి గ్రామదేవత కంచమ్మతల్లి అమ్మవారి ఉత్సవాలు జూన్ ఒకటి నుంచి పదో తేదీ వరకు నిర్వహించడానికి కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఒకటో తేదీ రాత్రి 12 గంటలకు అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానిస్తామని, పదో తేదీ రాత్రి 12 గంటలలోపు తిరిగి అమ్మవారిని ఆలయంలో సాగనంపడం జరుగుతుందని తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

డీఆర్ఎం దృష్టికి రైల్వే సమస్యలు



డీఆర్ఎంకు వినతి పత్రం అందజేస్తున్న రంగారావు

ఇచ్ఛాపురం: ఖుర్దా డివిజన్ రైల్వే డీఆర్ఎం హర్బన్‌సింగ్ దృష్టికి ఇచ్ఛాపురం, సోంపేట, జాడుపూడి రైల్వేస్టేషన్లలోని సమస్యలను జడ్ఆర్‌యూసీసీ సభ్యులు శ్రీనివాసరంగారావు తీసుకెళ్లారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను డీఆర్ఎం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రత్తకన్న రోడ్‌లో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, సోంపేట రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్‌ని తెరపించాలని, జాడుపూడి రైల్వేస్టేషన్‌లో బ్రహ్మపూర్-వైజాగ్ ఇంటర్‌సిటీని నిలుపుదల చేయాలని వినతి పత్రం అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

ఇచ్ఛాపురం: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీవో పి.నాగరాణి బుధవారం బుధవారం సందర్శించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్రాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సిబ్బంది రవణమ్మ, స్వాతి పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



పరామర్శలో విజయ తదితరులు

కవిటి: బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన తోట దుదిష్టి కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ.. దుదిష్టి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు.

టాలెంట్ టెస్టు విజేత మంచినీళ్లపేట

సోంపేట: బారువ గ్రామంలో పూర్వవిద్యార్థి సంఘం 64వ వార్షికోత్సవం సందర్భంగా బారువ ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో ప్రాథమిక స్థాయి డివిజనల్ గ్రూప్ టాలెంట్ టెస్టును బుధవారం నిర్వహించారు. మొత్తం 198 బృందాలు పాల్గొన్నాయి. ప్రథమ స్థానం ఎంపీపీఎస్ మంచినీళ్లపేట (వజ్రపు కొత్తూరు), రెండో స్థానం ఎంపీపీఎస్ మామిడిపల్లి(పలాస), తృతీయస్థానం ఎంపీపీఎస్ గెద్దూరు (మందస) నిలిచాయి. ఉపాధ్యాయు లు, పూర్వవిద్యార్థి సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అండర్-12 జిల్లా క్రికెట్ జట్టుకు నలుగురు ఎంపిక

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన ఇచ్ఛాపురం క్రికెట్‌క్లబ్ నుంచి జిల్లా అండర్-12 బాలురు క్రికెట్ జట్టుకి నలుగురు చిన్నారులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో సాలిన సాయిడిసాజ యాదవ్, సమీత్‌గౌడో, ఎ.వి.దక్ష, ఓంప్రకాష్‌లు ఉన్నట్టు కోచ్ గోపి తెలిపారు. వీరు ఈ నెలలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం క్రికెట్ స్టేడియంలో జరుగనున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

ఉపాధి సిబ్బందికి శిక్షణ

కవిటి: ఉపాధి హామీ పథకం సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి అన్నారు. కవిటి మండల కంప్యూటర్ సెంటర్ ఆవరణలో కవిటి, ఇచ్ఛాపురం మండలాలకు చెందిన ఉపాధిహామీ సాంకేతిక, క్షేత్ర సహాయకులు, మేట్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వేతనదారులకు రోజుకు రూ. మూడు వందలు గిట్టుబాటయ్యేలా వారిలో అవగాహన కల్పించాలన్నారు. కవిటి ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, కవిటి, ఇచ్ఛాపురం ఏపీవోలు తలగాన మోహనరావు, పెట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అశవర్కర్ల సేవలు అమోఘం

కాశీబుగ్గ: ఆశవర్కర్ల సేవలు వెలకట్టలేనివని మండల వైద్యాధికారి డాక్టర్ సునీల్ అన్నారు. పలాస మండలం రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన అశవర్కర్ల దినోత్సవం సందర్భంగా అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ మౌనిక, ఫార్మసీ ఆఫీసర్ బోనెల గోపాలరావు, పీహెచ్ఎన్ సత్యవతి పాల్గొన్నారు.



కంచిలి రైల్వేఫీడర్ నుంచి బొగాబెణి రోడ్డులో అసంపూర్తిగా రోడ్డు పనులు



కంచిలి: మరమ్మతులకు నోచుకోని అంపురం-ఘాటీముకుందాపురం రోడ్డు

హామీలు గోతుల్లో కలిశాయి..!

- ప్రహసనంగా రోడ్ల మరమ్మతులు
- నిధులు మంజూరైనా గుంతలు పూడ్చని వైనం

కంచిలి:

సంక్రాంతి పండుగ నాటికి గుంతల్లేని రోడ్లను ఏర్పాటు చేస్తామని చెప్పిన కూటమి నాయకుల హామీలు ఆచరణలో అమలు కాలేదు. అక్కడక్కడ జరిగిన మరమ్మతు పనుల్లో సైతం నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చారనే విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధి కంచిలి మండలంలో రోడ్ల మరమ్మతులు ప్రహసనంగా మారాయి. మండలంలో ఆర్అండ్‌బీ పరిధిలో ఐదు రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు. వాటిలో ఇప్పటివరకు మూడు రోడ్లను మాత్రమే గుంతలు పూడ్చే పనులు చేపట్టారు. మిగతా రెండూ ఎంతో ప్రాధాన్యత కలిగినవైప్పటికీ ఇంతవరకు గుంతలు పూడ్చే పనులు ప్రారంభించలేదు. కంచిలి రైల్వే ఫీడర్ నుంచి బొగాబెణి మీదుగా గోపకేళి వరకు ఆరు కిలోమీటర్ల పరిధిలో గుంతలు పూడ్చేందుకుగాను రూ. 30 లక్షలు మంజూరు చేయడంతో ఆ రోడ్డులో గుంతలు పూడ్చే పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రైల్వేఫీడర్ నుంచి బొగాబెణి వరకు గుంతలు పూడ్చే పనులను పూర్తిచేశారు. మిగతా భాగం పూర్తి చేయలేదు. ఇప్పటి వరకు చేపట్టిన పనులు కూడా పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పూడ్చిన గుంతలు కూడా కంటితుడుపుగానే చేపట్టారు. ఇక ఎన్‌హెచ్-5 నుంచి మకరాంపురం మీదుగా బి.గొనపపుట్టుగ గ్రామం వరకు మూడు కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ. 8 లక్షలు, తలతంపర నుంచి రామయ్యపట్నం వరకు ఐదు కిలోమీటర్ల మరమ్మతులకు రూ. 14లక్షలు మంజూరు చేశారు. ఈ రెండు రోడ్ల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదనే విమర్శలు వస్తున్నాయి. అంపురం నుంచి ఘాటీముకుందాపురం వరకు సుమారు 11 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ. 8 లక్షలు, కుంబరినొగాం నుంచి ఘాటీముకుందాపురం వరకు రెండు కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ. 8.1 లక్షలు మంజూరు చేసినప్పటికీ ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. అంపురం-ఘాటీముకుందాపురం రోడ్డు పరిస్థితి దారుణంగా తయారైంది. దారిపొడవునా పెద్దపెద్ద గోతులతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కుంబరినొగాం నుంచి ఘాటీముకుందాపురం రోడ్డు కూడా చాలా కాలంగా ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా రూపం కోల్పోయింది. అలాగే కొన్నిచోట్ల చేసిన సీసీ రోడ్ల పక్కన బెర్ములు కూడా ఏర్పాటు చేయలేదు.



కంచిలి: జాడుపూడి గ్రామంలో సిమెంటు రోడ్డు మంజూరైన చోట నిర్మాణం చేపట్టని వైనం



కంచిలి: గుంతలమయమైన కుంబరినొగాం-ఘాటీముకుందాపురం రోడ్డు

రోడ్డు మీద రోడ్డు!

సంతబొమ్మాళి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సంతబొమ్మాళి మండలంలోని పలు గ్రామాల్లో వేసిన రోడ్డు పనులు జరిగిన తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వేసిన సీసీ రోడ్డుపైనే ఇప్పుడు రోడ్డు వేసి కూటమి నాయకులు జేబులు నింపుకుంటున్నారని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని 34 పంచాయతీల్లో 171 పనులకు రూ. 1500 లక్షలు నిధులు మంజూరయ్యాయి. సంతబొమ్మాళి, నౌపడ, యామలపేట, ఆకాశలక్కవరం తదితర పంచాయతీలో ఉన్న రోడ్లపైనే మళ్లీ రోడ్డును వేశారు. యామలపేట, సీతారాంపురం, ఆకాశలక్కవరంలో వేసిన రోడ్డు అసంపూర్తిగా వదిలేశారు. ఆకాశలక్కవరంలో లోకేషన్ మార్చి టీడీపీ నాయకుడు పరపటి ఎర్రయ్య ఇంటికి సీసీ రోడ్డు చేశారు. నౌపడ, చిన్న కేసునాయుడుపేట, సంతబొమ్మాళి తదితర పంచాయతీల్లో ఇంకా కొన్ని రోడ్ల పనులు ప్రారంభించలేదు.



సంతబొమ్మాళి: లోకేషన్ మార్చి ఆకాశలక్కవరంలో టీడీపీ నాయకుడు ఎర్రయ్య ఇంటికి సీసీ రోడ్డు వేసి ఉన్న దృశ్యం



సంతబొమ్మాళి: యామలపేటలో రోడ్డుపై రోడ్డు వేసి అసంపూర్తిగా వదిలేసిన దశ్యం



సంతబొమ్మాళి: సీతారాంపురంలో అసంపూర్తిగా వదిలేసిన సీసీ రోడ్డు

విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ విజయ



రిబ్బన్ కట్ చేసి ప్రోటీలను పారంభిస్తున్న చైర్‌పర్సన్ విజయ

కవిటి: విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కవిటి మండలం వరక పంచాయతీ నర్తుపుట్టుగ గ్రామంలో బుధవారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించేందుకు క్విజ్ పోటీలు మంచి వేదిక అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఉపయోగంగా ఉంటాయన్నారు. క్విజ్ పోటీల విజేతగా హరిపురం జెడ్పీహెచ్ఎస్ ప్రథమ, బొరివంక జెడ్పీహెచ్ఎస్ ద్వితీయ, కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల తృతీయ స్థానాలను దక్కించుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు నర్తు శివాజీ, దట్టి అజయ్, నర్తు సోమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12న 5కే రన్

కాశీబుగ్గ: ఈనెల 12వ తేదీన జాతీయ యువజనోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఫైవ్ కే రన్ నిర్వహిస్తున్నట్లు ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి గొరకల లోకేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వజ్రపుకొత్తూరు మండలం గరుడభద్ర కూడలి నుంచి నీలావతి గ్రంథాలయం వరకు నిర్వహించే రన్‌లో పురుషులు మాత్రమే పాల్గొనాలన్నారు. విజతలుగా నిలిచే ఐదుగురికి రూ.15 వేల వరకు నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. హాజరయ్యేవారికి అల్పాహార సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తిఉన్నవారు 88976 60563, 99637 08029, 96343 14502 నంబర్లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

డ్రైవర్‌కు గాయాలు

కాశీబుగ్గ: పలాస జాతీయ రహదారిలో కోసంగిపురం కూడలి వద్ద బుధవారం రెండు లారీలు పరస్పరం ఢీకొట్టుకోవడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనులు వేగవంతం చేయండి

- డీఆర్ఎం హెచ్ఎస్ భజ్వా



స్టేషన్ పరిశీలిస్తున్న డీఆర్ఎం భజ్వా

కాశీబుగ్గ: రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, వేగవంతంగా పూర్తి చేయాలని ఈస్ట్ కోస్టు రైల్వే ఖుర్దా డివిజన్ డీఆర్ఎం హెచ్ఎస్ భజ్వా అన్నారు. పలాస రైల్వే స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. పలాస రైల్వే స్టేషన్ ఏ గ్రేడ్‌లో ఉండడంతో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా విడుదలైన నిధులతో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఏడాదిగా జరుగుతున్నటువంటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అనంతరం పలాస రైల్వేప్లాట్ ఫాంలు, లిఫ్టులు, రైల్వే కాలనీలు, ఆర్‌పీఎఫ్ బ్యారెక్, టూవీలర్ స్టాండ్, బీటీ రోడ్డు, స్టేషన్ ఫ్రంట్ లుక్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు కల్పించకుండా మౌలిక సదుపాయాలు కలిగించాలని ఆదేశించారు. డీఆర్ఎం రాకతో అధికారులు పరుగులు పెట్టారు. దీనిలో భాగంగా రెండు చోట్ల ఉన్నటువంటి లిఫ్టులు వాడుకలోకి తీసుకొచ్చారు.

ప్రాణాలు కాపాడిన అగ్నిమాపక శాఖాధికారులు

సోంపేట: పట్టణంలోని హరిజన వీధికి చెందిన నొహిరి ప్రతాప్ ప్రమాదవశాత్తు వీధిలోని బావిలో రాత్రి పడిపోయాడు. దీంతో స్థానికులు వెంటనే అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి సిబ్బంది చేరుకుని ప్రతాప్‌ను బయటకు తీసి, ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. బావిలో నీరు తక్కువగా ఉండడంతో పాటు వెంటనే సిబ్బంది స్పందించడంతో ప్రాణాలతో బయటపడ్డాడని స్థానికులు పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖాధికారి ఎస్.మోహనరావు, సిబ్బంది రమేష్‌నాయుడు, కె.భాస్కరరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.




ప్రతాప్‌తో అగ్నిమాపక సిబ్బంది

వారాన్ని మార్చేస్తున్నారు..!



ఒకే గదిలో రెండు రోజుల బెడ్‌షీట్లు వినియోగిస్తున్న వైనం



బుధవారం అని రాసి ఉన్న బెడ్‌షీట్

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఉతికి ఆరేసిన బెడ్‌షీట్లను ఏరోజు కారోజు వాడాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఒకరోజుకు బదులు మరోరోజుకు సంబంధించిన బెడ్‌షీట్లను పడకలపై సిబ్బంది పరుస్తున్నారు. అత్యవసర విభాగంలోని పడకలపై బుధవారం పేరుతో ఉన్న బెడ్‌షీట్‌ను వేయాల్సి ఉండగా.. గురువారం బెడ్‌షీట్‌ను ఉంచారు. మూడో అంతస్తులోని పడకలపై శనివారం, ఆదివారం, మంగళవారం అంటూ ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారు. అధికారులు స్పందించి ఏరోజు బెడ్ షీట్ ఆ రోజు వాడితే బాగుంటుందని రోగులు కోరుతున్నారు.

గ్రానైట్ క్వారీకి నోటీసులు

టెక్కలి: మండలంలోని గూడేం పంచాయతీ సన్యాసినీలాపురం గ్రామానికి ఆనుకుని ఉన్న ఖాసీంఖాన్ గ్రానైట్ క్వారీకి మైన్స్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు క్వారీ నిర్వహణలో బ్లాస్టింగ్‌లు చేస్తూ గ్రామంలో భయాందోళన సృష్టిస్తున్నారని, అంతేకాకుండా ఆస్తులకు నష్టం వాటిల్లితోందని ఇటీవల గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో మైన్స్ అధికారులు గ్రామంలో బుధవారం విచారణ చేపట్టారు. విచారణ అనంతరం గ్రామస్తుల నుంచి సేకరించిన అంశాలతో సంబంధిత క్వారీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశామని మైన్స్ ఏడీ విజయలక్ష్మి వెల్లడించారు.

చైర్మన్‌గా కణితి నవీన్



కణితి నవీన్

నందిగాం: కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం హరిదాసుపురానికి చెందిన కణితి నవీన్ నియామకమయ్యారు. నవీన్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఆర్అండ్‌బీ ప్రధాన కార్యాలయం విజయవాడలో జాయింట్ స్టేట్ ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తున్నారు. నవీన్ గతంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆ కమిటీ చైర్మన్‌గా నియమించింది. ఈ కమిటీలో ముగ్గురు సభ్యులుంటే అందులో ఒక్కరిని ఎన్నుకుంటారు. మిగతా ఇద్దరు సభ్యులను కేంద్రం నామినేట్ చేస్తుంది. నవీన్‌ను చైర్మన్‌గా ఎన్నుకోగా, మహారాష్ట్రకు చెందిన పుష్కర్ మురళీధర్ కన్విండే, చండీఘర్‌కు చెందిన అజయ్‌కేశవ్‌లను సభ్యులుగా నామినేట్ చేసింది. ఈ కమిటీ దేశవ్యాప్తంగా మౌలిక వసతుల విషయంలో నిబంధనలు పాటించని, తప్పులు చేసిన ఆర్కిటెక్ట్‌లను విచారించి చర్యలు తీసుకుంటుంది. ఈ కమిటీలో మొదటిసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారికి అవకాశం రావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూలపేటలో పారిశుద్ధ్య పనులు

సంతబొమ్మాళి: మూలపేట, విష్ణుచక్రం గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు బుధవారం నిర్వహించారు. కాలువల్లో పూడికలతీత చేపట్టి బ్లీచింగ్ చల్లారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి అనిల్ ప్రభాస్ కోరారు.

సేంద్రియ కూరగాయలపై ఆసక్తి..



సంక్రాంతి పండుగ సమీపిస్తోంది. దూరప్రాంతాల్లో ఉంటున్నవారు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ఇలాంటివారంతా పలాస జాతీయ రహదారి పక్కన రైతులు విక్రయిస్తున్న సేంద్రీయ కూరగాయల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఎటువంటి క్రిమిసంహారక మందులను వినియోగించకుండా పండిస్తున్న టమాటా, ఉల్లిపాయలు, ఉల్లికాడలు, పచ్చిమిర్చిని రైతులు విక్రయిస్తున్నారు.

–కాశీబుగ్గ

రబీ పనుల్లో రైతులు నిమగ్నం..



వరుస తుఫాన్లతో ఖరీఫ్ గట్టెక్కిన రైతులు రబీ సీజన్‌లో పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలో దమ్ము పట్టడం, వరి నారు సిద్ధం చేయడం, నాట్లు వేయడం తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. రబీలో ఎటువంటి ఆటంకాలు లేకుండా సాగు ప్రక్రియ కొనసాగాలని రైతులు ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా రబీ సీజన్‌కు సాగు నీరు అందివ్వలేమంటూ ఇప్పటికే అధికార యంత్రాంగం ప్రకటించిన సంగతి తెలిసిందే.

–టెక్కలి

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన..



వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సోంపేట ఎస్ఐ లవరాజు అన్నారు. పట్టణంలోని ఆటోడ్రైవర్లతో బుధవారం సమావేశం నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పండుగలో రద్దీ దృష్ట్యా పోలీసులకు సహకరించాలన్నారు. అలాగే బారువ పోలీసులు హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు కొర్లాం గ్రామంలో అవగాహన కల్పించారు. హెచ్‌సీ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

–సోంపేట

ఆకట్టుకున్న రంగ వల్లికలు..



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన రంగ వల్లికల పోటీలు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లలు వేసిన వివిధ ముగ్గులు ఆకట్టుకున్నాయి.

–టెక్కలి

పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడకలు

ఇచ్ఛాపురం: బెల్లుపడ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఆడపిల్లలకు రంగవల్లిక పోటీలు, బాలురకు గాలిపటాల పోటీలు నిర్వహించారు. పిండివంటల ప్రదర్శన ఆకట్టుకుంది. హెచ్ఎం నీలాచలం, సిబ్బంది ప్రత్యూష, సత్యానంద్, ఎస్.దేవి, పుష్పలత పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. భోగిమంట వేసి చుట్టూ నృత్యాలు చేశారు. రామక్రిష్ణాపురంలోని సత్యసాయి విద్యా విహార్‌లో ముగ్గుల పోటీల్లో బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



కాశీబుగ్గ: సత్యసాయి విద్యావిహార్‌లో ముగ్గుల పోటీలో విద్యార్థినులు



ఇచ్ఛాపురం: ముగ్గులు వేస్తున్న బాలికలు



కాశీబుగ్గ: భోగిమంట వద్ద ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు



ఇచ్ఛాపురం: గాలిపటాల పోటీల్లో చిన్నారులు